# ఓటీఎస్‌కు చెరువు గండం

- ఇంకా రికార్డుల్లో చెరువుగానే జగ్గయ్య చెరువు కాలనీ
- నిలిచిపోయిన రిజిస్ట్రేషన్లు
- లబ్ధిదారుల ఆందోళన


పిఠాపురంలో జగ్గయ్య చెరువు కాలనీ

**పిఠాపురం:** ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించి అమలు చేస్తున్న ఓటీఎస్ పథకంపై ప్రజల నుంచి అనూహ్య స్పందన లభించింది. అయితే పిఠాపురం జగ్గయ్య చెరువు కాలనీ వాసులకు మాత్రం ఓటీఎస్ పథకం అమలుకు చెరువు గండంగా మారింది. గతంలో ఇక్కడ ఇళ్ల పట్టాలు పంపిణీ చేయగా అప్పటి నుంచి లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలు చేసుకుని నివాసం ఉంటున్నారు. ప్రభుత్వం పిఠాపురం మున్సిపాలిటీలో ప్రత్యేక వార్డులుగా గుర్తించింది. మున్సిపల్ ఎన్నికల్లో వార్డు కౌన్సిలర్లు కూడా ఎన్నికయ్యారు. ఒక ఊరిగా మారి ఏళ్లు గడుస్తున్నా అధికారుల నిర్లక్ష్యంతో రికార్డుల్లో ఇప్పటికీ చెరువుగానే ఉండిపోయింది. దీంతో ఓటీఎస్ పథకంలో వందల మంది లబ్ధిదారులు రిజిస్ట్రేషన్‌కు డబ్బులు కట్టినా రికార్డుల ప్రకారం చెరువుగా ఉండడంతో రిజిస్ట్రేషన్ల ప్రక్రియకు ఆటంకం ఏర్పడడంతో లబ్ధిదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**కాలనీలో 15వేల మంది ఉన్నా..**

జగ్గయ్య చెరువు అది ఒకప్పుడు చెరువు కాని ఇప్పుడు ఒక కాలనీగా మారింది. 15 వేల మంది జనాభా అక్కడ నివసిస్తున్నారు. 4 వేలకు పైగా గృహాలు ఐదు వేలకు పైగా కుటుంబాలున్నాయి. పిఠాపురం మున్సిపాలిటీలో అత్యధిక జనాభా నివసించే ప్రాంతంగా పేరొందింది. పిఠాపురం పట్టణాన్ని ఆనుకొని ఉన్న జగ్గయ్య చెరువులో సర్వే నంబరు 250/3లో 132.17 ఎకరాల భూములను పేదల గృహ నిర్మాణాల కోసం కేటాయించారు. 1992లో అర్హులైన 345 మందికి ఒక్కొక్కరికి రెండున్నర సెంట్ల చెప్పునా పట్టాలు పంపిణీ చేశారు. అనంతరం 1995లో మరో 60 మందికి ఒక్కొక్కరికి రెండున్నర సెంట్ల చెప్పునా పట్టాలిచ్చారు. తిరిగి 2005వ సంవత్సరంలో ఒక్కొక్కరికి సెంటున్నర చొప్పునా సుమారు రెండువేల మందికి పట్టాలు పంపిణీ చేశారు. 2007లో మరో 27 మందికి రెండు సెంట్ల చొప్పునా పట్టాలిచ్చారు. ఇప్పటి వరకూ సుమారు 3,200 మందికి జగ్గయ్య చెరువులో పట్టాలు పంపిణీ చేశారు. వీటిలో రాజీవ్ గృహకల్ప పథకం కింద 221 మందికి, మొదటి విడత ఇందిరమ్మ పథకంలో 472 మందికి పట్టాలిచ్చారు.

ప్రస్తుతం ఓటీఎస్ పథకంలో సుమారు 3400 మంది డబ్బు చెల్లించి రిజిస్ట్రేషన్ల కోసం దరఖాస్తులు చేసుకున్నారు. అయితే వీరి పేరున రిజిస్ట్రేషన్లు చేయడానికి రెవెన్యూ రికార్డుల్లో జగ్గయ్య చెరువు కాలనీ పంట చెరువుగా ఉండిపోవడంతో రిజిస్ట్రేషన్లకు ఆటంకం ఏర్పడింది.

**రికార్డుల్లో మార్చకపోవడం దారుణం**

ఎన్నో ఏళ్లుగా ఇంటి నిర్మాణానికి తీసుకున్న రుణం అప్పులు చేసి మరీ కడుతూ వచ్చాం. కాని ఇంకా తీరలేదు. ప్రస్తుతం ప్రభుత్వం ఓటీఎస్ పథకం అమలులోకి తీసుకురావడంతో న్యాయం జరుగుతుందని అందరం చాలా సంతోషించాం. కాని మా కాలనీకి సంబంధించి రిజిస్ట్రేషన్లు జరగక పోవడంతో ఇబ్బందులు పడుతున్నాం. ఉన్నతాధికారులు తగిన చర్యలు తీసుకుని మాకు రిజిస్ట్రేషన్లు జరిగేలా చూడాలి. ఎప్పుడో 30 ఏళ్ల క్రితం పట్టాలు ఇచ్చి అన్ని వసతులు కల్పించి కాలనీగా ఉన్న జగ్గయ్య చెరువును ఇంకా చెరువే అంటే ఎలా. పట్టాలిచ్చిన అధికారులు రికార్డుల్లో మార్చకుండా ఇలా ఏళ్ల తరబడి వదిలేయడం దారుణం. ప్రస్తుతం ఓటీఎస్ పథకం వచ్చింది కాబట్టి ఇది తెలిసింది పథకం రాకపోతే ఈ విషయం ఎప్పటికీ తెలిసేది కాదు. వేల మంది లబ్ధిదారులు ఇబ్బందులు పడుతున్నందున వెంటనే రికార్డుల్లో పేరు మార్చి న్యాయం చేయాలి. – బాలిపల్లి రాంబాబు, జగ్గయ్య చెరువు కాలనీ పిఠాపురం

**ప్రభుత్వానికి నివేదిక ఇచ్చాం**

పిఠాపురం జగ్గయ్య చెరువలో సుమారు 3400 మంది వరకూ ఓటీఎస్ పథకంలో రిజిస్ట్రేషన్లకు దరఖాస్తు చేసుకున్నారు. అయితే వీటి రిజిస్ట్రేషన్లలో ఆటంకం ఏర్పడింది. దీనిపై పూర్తి వివరాలతో జేసీ, జిల్లా కలెక్టర్లకు పూర్తి స్థాయి నివేదికలు ఇచ్చాం. లబ్ధిదారులందరికీ న్యాయం చేయడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. త్వరలోనే అందరికీ రిజిస్ట్రేషన్లు జరుగుతాయి ఎవరు ఆందోళన పడాల్సిన పని లేదు.
–త్రినాదరావు, తహసీల్దారు, పిఠాపురం

## క్లుప్తంగా

### మానసిక రుగ్మతలపై అవగాహన పెంచుకోవాలి


ర్యాలీ నిర్వహిస్తున్న సిబ్బంది

**కొత్తపల్లి:** మానసిక రుగ్మతలపై అవగాహన పెంచుకోవాలని ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యాధికారి సుష్మ అన్నారు. ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం సందర్భంగా కాకినాడ ఉమా మనోవికాశ కేంద్రం ఆధ్వర్యంలో మంగళవారం ర్యాలీ నిర్వహించారు. మండల సంరక్షణ కమిటీ ఆధ్వర్యంలో పలు సమస్యలపై వైద్యాధికారికి వినతిపత్రం అందజేశారు. కోఆర్డినేటర్ అనూష, ఉమా మనోవికాస కేంద్రం , వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

### పిఠాపురం సీఐగా శ్రీనివాస్


బాధ్యతలు స్వీకరిస్తున్న సీఐ శ్రీనివాస్

**పిఠాపురం:** స్థానిక సీఐగా జి.శ్రీనివాస్ మంగళవారం పదవీ బాధ్యతలు చేపట్టారు. విజయవాడ నుంచి బదిలీపై వచ్చిన ఆయన ఇక్కడ బాధ్యతలు స్వీకరించగా ఇప్పటి వరకూ ఇక్కడ పని చేసిన వైఆర్‌కే శ్రీనివాస్ కాకినాడ బదిలీపై వెళ్లారు. నియోజకవర్గంలో ట్రాఫిక్ సమస్యను పరిష్కరించడంతో పాటు సారా తయారీ, గంజాయి రవాణా వంటి వాటిపై దృష్టి సారిస్తామని శ్రీనివాస్ అన్నారు.

### ఆటో యూనియన్ అధ్యక్షుడిగా నాగరాజు


ఆటో యూనియన్‌ను అభినందించిన దవులూరి సుబ్బారావు

**సామర్లకోట:** స్థానిక శ్రీసాయి గణపతి ఆటో యూనియన్ నూతన కమిటీ అధ్యక్షుడిగా నూతలపాటి నాగరాజు ఎన్నికయ్యారు. మంగళవారం ఆటో యూనియన్ సర్వసభ్య సమావేశంలో నూతన కమిటీ ఎన్నిక జరిగింది. యూనియన్ కార్యదర్శిగా ముమ్మిడి శ్రీనుబాబు, ఉపాధ్యక్షుడిగా దూళ్ల వెంకటరమణ, సహాయ కార్యదర్శిగా గెడ్డం సతీష్, కోశాధికారిగా మేకల అప్పారావు ఎన్నికైనట్టు యూనియన్ గుమస్తా మిరియాల అశ్వత్థామ తెలిపారు. కమిటీ సభ్యులను దవులూరి చారిటబుల్ ట్రస్ట్ అధినేత దవులూరి సుబ్బారావు అభినందించారు.

### పోస్టల్ సేవలపై అవగాహన


అమీనాబాదులో ర్యాలీ నిర్వహిస్తున్న పోస్టల్ సిబ్బంది

**కొత్తపల్లి:** పోస్టల్ ద్వారా అందే సేవలపై ప్రజలు అవగాహన పెంచుకోవాలని పోస్టల్ ఇన్‌స్పెక్టర్ చైతన్య అన్నారు. పోస్టల్ దినోత్సవం సందర్భంగా మంగళవారం మండలంలోని అమీనాబాదులో జనంలోకి మనం అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ర్యాలీ చేసి పోస్టల్ సేవలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా చైతన్య మాట్లాడుతూ పోస్టల్ కార్యాలయం అంటే ఉత్తరాలు ఇవ్వడం, తీసుకోవడమే కాకుండా అనేక జీవిత బీమాపై అనేక పథకాలను అందిస్తోందన్నారు. తక్కువ ఖర్చులోనే పార్శిల్ సర్వీసులను అందుబాటులో ఉంది. తక్కువ ప్రీమియంతో ఎక్కువ టర్మ్ ప్రమాద బీమా సదుపాయం కలిస్తుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచి నక్కా మణికంఠబాబు, ఇండియా పోస్టల్ పేమెంట్ బ్యాంకు మేనేజర్ రాజ్‌కుమార్, ఎంఓ నాగార్జున్ ఉన్నారు.

### వైభవంగా పైడితల్లి అమ్మవారి జాతర


జాతరలో ఆకట్టుకుంటున్న గరగ నృత్యాలు

**పిఠాపురం:** స్థానిక పైడితల్లి అమ్మవారి జాతర మంగళవారం వైభవంగా నిర్వహించారు. పట్టణంలో గ్రామ దేవతగా పూజలందుకుంటున్న అమ్మవారి జాతర మంగయ్యమ్మరావు పేట, ఇంద్రనగర్ తదితర ప్రాంతాల్లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన గరగ నృత్యం భక్తులను ఆకట్టుకుంది. మూడు రోజుల పాటు ఉత్సవాలు నిర్వహించనున్నట్టు నిర్వాహకులు తెలిపారు. జాతర సందర్భంగా ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

## మరింత వేగంగా ఓటర్ల జాబితా

- ప్రజాప్రతినిధుల సహకారం అవసరం
- అవగాహన సదస్సులో ఆర్డీవో రామారావు


సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీఓ జేఎస్ రామారావు

**పెద్దాపురం:** నియోజకవర్గంలో చేపట్టే ఓటర్ల జాబితా రూపకల్పన మరింత వేగవంతంగా జరుగుతోందని, అన్ని రాజకీయ పార్టీల ప్రజా ప్రతినిధులు సహకరించాలని నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, ఆర్డీవో జేఎస్ రామారావు కోరారు. స్థానిక ఆర్డీవో కార్యాలయ చాంబర్‌లో మంగళవారం ఓటరు జాబితా రూపకల్పనపై వివిధ రాజకీయ పార్టీల ప్రజా ప్రతినిధులకు సమావేశం ఏర్పాటు చేశారు. రానున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఓటర్ల జాబితా రీ సర్వే మరింత వేగవంతం చేసినట్టు తెలిపారు. ఎన్నికల కమిషన్ నిబంధనలపై ప్రజా ప్రతినిధులు మరింత అవగాహన పెంపొందించుకోవాలన్నారు. ఓటర్ల జాబితా రూపకల్పనలో 4629 చేర్పులు చేయగా, 7355 మంది ఓటర్లను తొలగించామన్నారు. ఒకే డోర్ నెంబర్‌తో 10 కంటే ఎక్కువ మంది ఓటర్లు ఉన్న డోర్ నెంబర్లు 191 ఉన్నాయని, వీటి సవరణకు ఫారం–8 ద్వారా 555 దరఖాస్తులు, ఫారం 7 ద్వారా 31 దరఖాస్తులు తీసుకున్నట్టు తెలిపారు. సమావేశంలో పెద్దాపురం తహసీల్దార్ వి.జితేంద్ర, మున్సిపల్ కమిషనర్ జంపా సురేంద్ర, మేనేజర్ జ్యోతిరాణి, జెడ్పీటీసీ గవరసాని సూరిబాబు, (వైఎస్సార్ సీపీ), రంధి సత్యనారాయణ (టీడీపీ), చింతా శ్రీనివాసరావు (వైఎస్సార్ సీపీ)లతో పాటు ఆయా పార్టీల ప్రజా ప్రతినిధులు, సిబ్బంది పాల్గొన్నారు.

## శ్వాసపై ధ్యాసతో మానసిక ఆరోగ్యం

జేఎన్‌వీ ప్రిన్సిపాల్ రామిరెడ్డి


బహుమతులు పొందిన విద్యార్థులతో ప్రిన్సిపాల్ రామిరెడ్డి

**పెద్దాపురం:** ప్రతి వ్యక్తి మానసిక రుగ్మతులపై అవగాహన కలిగి ఉండాలని పెద్దాపురం జవహర్ నవోదయ విద్యాలయ ప్రిన్సిపాల్ కె.రామిరెడ్డి అన్నారు. ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం స్థానిక నవోదయ విద్యార్థులకు నిర్వహించిన ప్రతిభా పోటీలలో విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా వైస్ ప్రిన్సిపాల్ రామకృష్ణయ్య అధ్యక్షతన జరిగిన సమావేశంలో ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరికి మానసిక ఆరోగ్యం ఎంతో ప్రాముఖ్యమని, ప్రతి రోజు కొద్ది సేపు శ్వాస మీద ధ్యాస ఉంచాలన్నారు. దీని ద్వారా శరీరంలోని కణాలు ఉత్తేజం చెంది మనసు ప్రశాంతంగా ఉంటుందన్నారు. తద్వారా విద్యపై శ్రద్ధ కనపర్చవచ్చన్నారు. అనంతరం విద్యార్థులకు నిర్వహించిన క్విజ్, స్పాట్ డిబేట్, పోస్టర్ మేకింగ్ తదితర పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు ఆయన బహుమతి ప్రదానం చేశారు. విద్యాలయ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## సీఎం సభను విజయవంతం చేయండి

జెడ్పీటీసీ సూరిబాబు


సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీటీసీ సూరిబాబు

**పెద్దాపురం:** ఈ నెల 12వ తేదీన రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నియోజకవర్గ పర్యటనను ప్రజా ప్రతినిధులు, అధికారులు సమష్టి కృషితో విజయవంతం చేయాలని జెడ్పీటీసీ గవరసాని సూరిబాబు, ఎంపీపీ పెంకే సత్యవతి, వైస్ ఎంపీపీ మిరియాల రాజా, పార్టీ రాష్ట్ర కార్యదర్శి కంటే వీర్రాఘవరావు అన్నారు. సామర్లకోటలో ఎంపీడీఓ బత్తిన అశోక్‌కుమార్ అధ్యక్షతన మండల స్థాయి అధికారులు, ప్రజా ప్రతినిధులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సామర్లకోటలో పర్యటించి బహిరంగ సభలో ప్రసంగిస్తారన్నారు. సభాస్థలి వద్దకు గ్రామీణ ప్రాంతాల నుంచి జనసమీకరణ సమష్టిగా చేపట్టి సీఎం సభను విజయవంతం చేయాలని సూరిబాబు కోరారు. సచివాలయ మండల కన్వీనర్ గోపు మురళి, వ్యవసాయ సలహా మండలి సభ్యులు యినకొండ వీరవిష్ణుచక్రం మాట్లాడుతూ సీఎం సభకు నియోజకవర్గ వ్యాప్తంగా జన ప్రభంజనం ఉండేలా ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు ప్రణాళిక సిద్ధం చేశారన్నారు. ఎంపీడీఓ కార్యాలయ సూపరింటెండెంట్ సత్యనారాయణమూర్తి, గోలి రామారావు, పరిమి శ్రీనివాస్, నల్లల గోవిందు, పుట్టా వెంకట్రావు, వాసిరెడ్డి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## సామాజిక అంశాలపై చైతన్యం అవసరం


సామర్లకోటలో హరిప్రియుడును అభినందిస్తున్న ఆర్జేడీ నాగమణి

- విద్యార్థులకు ఆర్జేడీ నాగమణి పిలుపు
- ప్రధాని మోదీ అభినందన పొందిన హరిప్రియుడుకు ప్రశంసాపత్రం అందజేత
- సీబీఎస్ఈ పరీక్ష పత్రాల పరిశీలన

**సామర్లకోట:** మున్సిపల్ హైస్కూల్ విద్యార్థికి ప్రధాని మోదీ నుంచి అభినందన రావడం గర్వించదగ్గ విషయమని విద్యాశాఖ ఆర్‌జేడీ జి.నాగమణి అన్నారు. మంగళవారం సాయంత్రం స్థానిక బచ్చు ఫౌండేషన్ మున్సిపల్ హైస్కూల్‌ను ఆమె సందర్శించి పరీక్ష పే చర్చలో పాల్గొన్ని ప్రధాని మోదీ నుంచి అభినందన పొందిన 10వ తరగతి విద్యార్థి హరిప్రియుడుకు ప్రశంసాపత్రాన్ని అందజేసి అభినందించారు. విద్యార్థులు చదువుతో పాటు సామాజిక చైతన్యం కలిగించే అంశాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. సీబీఎస్ఈ విధానంలో జరిగిన పరీక్ష పత్రాలను ఆమె పరిశీలించారు. విద్యతో పాటు అన్ని కార్యక్రమాల్లో విద్యార్థులను ప్రోత్సహిస్తున్న హెచ్‌ఎం తోటకూర సాయిరామకృష్ణను ఆర్‌జేడీ అభినందించారు. ఈ ఏడాది ఈ హైస్కూల్‌కు 9వ తరగతి నుంచి సీబీఎస్ఈ విధానం అమలులోకి వచ్చిన నేపథ్యంలో విద్యార్థులను ఆ మేరకు ఉపాధ్యాయులు తయారు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీవైఈఓ ఆర్‌జే డానియల్‌రాజు, ఎంఈఓలు వై.శివ రామకృష్ణయ్య, పి.పుల్లయ్య, హెచ్‌ఎంలు యు.సత్యనారాయణ, మీనామాధురి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## రేపు కేసీబీఎస్ వందేళ్ల సంబరాలు

సంస్థ అధ్యక్షుడు కోసూరి వెల్లడి


సమావేశంలో మాట్లాడుతున్న కేసీబీఎస్ అధ్యక్షుడు కోసూరి శ్రీనివాస సత్యనారాయణమూర్తి

**కాకినాడ:** ది కాకినాడ కో–ఆపరేటివ్ బిల్డింగ్ సొసైటీ ఏర్పాటై వందేళ్లు పూర్తి చేసుకుని 101వ సంవత్సరంలోకి అడుగుపెడుతున్న సందర్భంగా గురువారం సాయంత్రం 5 గంటలకు స్థానిక సూర్యకళామందిరంలో వేడుకలు నిర్వహిస్తున్నట్టు కేసీబీఎస్ అధ్యక్షుడు కోసూరి శ్రీనివాస సత్యనారాయణమూర్తి చెప్పారు. కార్యక్రమ ఏర్పాట్లపై మంగళవారం సంస్థ డైరెక్టర్లు, ప్రతినిధులతో సమావేశమై చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తమిళనాడు మాజీ చీఫ్ సెక్రటరీ, విశ్రాంత ఐఏఎస్ అధికారి పి.రామ్మోహనరావు, గౌరవ అతిథులుగా ఎంపీ వంగా గీత, ఎమ్మెల్యేలు ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి, కురసాల కన్నబాబు, డీసీసీబీ చైర్మన్ ఆకుల వీర్రాజు, కేంద్ర మాజీ మంత్రి పళ్లంరాజు, ఇన్‌కం టాక్స్ విశ్రాంత చీఫ్ కమిషనర్ పీవీ రావు, విశ్రాంత ఐఆర్ఎస్ అధికారి ఆర్.మంగబాబు తదితర ప్రముఖులు హాజరుకానున్నారు. సమావేశంలో సంస్థ ఉపాధ్యక్షుడు రెడ్డి వీరరాజేంద్రకుమార్, కార్యదర్శి ముమ్మిడి గోవిందు, డైరెక్టర్లు ముత్తా మధు, ముమ్మిడి వెంకటరమణ, ఒబిలిశెట్టి బుచ్చిరాజు శివ బాలయోగి, కోసూరి లక్ష్మీప్రసాద లావణ్య, ఇన్‌చార్జి మేనేజర్ చీమలకొండ గంగాధరం తదితరులు పాల్గొన్నారు.

## మెకనైజ్డ్ మండీయార్డుకు నడకుదురు అనుకూలం

జిల్లా పౌరసరఫరాల సంస్థ మేనేజర్ పుష్పమణి


నడకుదురులో స్థలాన్ని పరిశీలిస్తున్న జిల్లా మేనేజర్ పుష్పమణి, తహసీల్దార్ శ్రీనివాసరావు

**కరప:** జిల్లాలో మెకనైజ్డ్ మండి యార్డ్ ఏర్పాటు చేయనున్నట్టు పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ డి.పుష్పమణి తెలిపారు. ఇందుకు అనువైనస స్థలాన్ని ఎంపిక చేసేందుకు మంగళవారం ఆమె మండలంలో పర్యటించారు. కరప రైతు భరోసా కేంద్రం, పేపకాయలపాలెం, నడకుదురులలోని మార్కెట్ కమిటీ స్థలాలు, ఎస్‌డబ్ల్యూసీ గోదాంల స్థలాన్ని ఆమె పరిశీలించారు. ఎస్‌డబ్ల్యూసీ గోదాం స్థలం అనుకూలంగా ఉంటుందని పుష్పమణి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె స్థానిక విలేకరులతో మాట్లాడారు. రైతుల నుంచి ఆర్‌బీకేల ద్వారా ప్రభుత్వ మద్దతు ధరకు కొనుగోలు చేసిన ధాన్యాన్ని ఈ యార్డుకు తరలిస్తారన్నారు. అక్కడే ఏర్పాటు చేసిన ల్యాబ్‌లో పరీక్షలు జరిపి, వేయింగ్‌బ్రిడ్జిపై కాటా తదుపరి చర్యలు చేపడతారన్నారు. ఈ యార్డు నెలకొల్పేందుకు 20 లారీలకు సరిపడా పార్కింగ్ ప్లేస్, వేయింగ్‌బ్రిడ్జి, ల్యాబ్, వర్క్‌షాప్, డ్రైయ్యర్‌వంటి వసతులు కల్పించేందుకు స్థలాన్ని పరిశీలించి, ఎస్‌డబ్ల్యూసీ గోదాంల పక్కస్థలం అనువుగా ఉందని డీఎం తెలిపారు. తహసీల్దార్ పి.శ్రీనివాసరావు, ఆర్ఐ పేపకాయల మాచ్రావు పాల్గొన్నారు.

## ఉత్సాహంగా ఎస్‌జీఎఫ్ఐ అథ్లెటిక్స్‌కు ఎంపికలు


హర్డిల్స్‌లో పోటీపడుతున్న క్రీడాకారిణి


హైజంప్ విభాగంలో పోటీపడుతున్న క్రీడాకారిణి

**నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ):** జిల్లా పాఠశాల క్రీడాసమాఖ్య అండర్–14, 17 ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక జిల్లా క్రీడామైదానంలో అండర్–14, 17 అథ్లెటిక్స్‌లో బాల, బాలికల ఎంపికలు జరిగాయి. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పరిధిలో వెయ్యి మంది ఈ ఎంపికల్లో పాల్గొన్నారు. వీరికి రన్స్, త్రోస్, జంప్‌ల్స్ ప్రతిభా పరీక్షలు నిర్వహించి 48 మందిని అంతర్ జిల్లాల ఎస్‌జీఎఫ్ఐ చాంపియన్ షిప్‌కు ఎంపికచేశారు. ఎంపికల నిర్వహణలో 80 మంది పీడీలు సహకరించారు. ఎస్‌జీఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ప్రసాద్ తెలిపారు. జిల్లా పీఈటీ సంఘ అధ్యక్షుడు వి.రవిరాజు, అథ్లెటిక్స్ సంఘ సభ్యులు గిరి, నూకరాజు, ప్రసాద్‌రెడ్డి, బాబి కౌరు తదితరులు పాల్గొన్నారు.

### అల్లిపూడిలో స్వచ్ఛభారత్


అల్లిపూడిలో స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న చినబాబు

**కోటనందూరు:** ఎన్ఎస్ఎస్ కార్యక్రమంలో భాగంగా తుని ఆదిత్య డిగ్రీ కళాశాల విద్యార్థులు శనివారం అల్లిపూడిలో స్వచ్ఛభారత్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని వైఎస్సార్ సీపీ మండల కన్వీనరు చింతకాయల చినబాబు ప్రారంభించారు. విద్యార్థులు గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి అపరిశుభ్ర వాతావరణంతో కలిగే అనర్థాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. రోడ్లు, పరిసరాలు, డ్రైన్లు శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. అనంతరం చీపుర్లు పట్టి రోడ్లను శుభ్రం చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఏవీ రమణ, ఆదిత్య డిగ్రీ కళాశాల అధ్యాపకులు ఎండీ షాహిద్దిన్, ఎన్ఎస్ఎస్ పీఓ కె.తమ్మారావు, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు పాల్గొన్నారు.

### భూమికి జానెడు.. దీనిసొగసు చూడు..



భూమికి జానెడు అన్నట్టుగా ఉన్న ఆ బుజ్జి తువ్వాయిని.. దాని సొగసును చూసిన వారు ఎంతో మురిసిపోతున్నారు. సాధారణంగా పుంగనూరు జాతి ఆవులంటేనే చాలా పొట్టిపొట్టిగా.. మూడడుగుల ఎత్తున చూడ ముచ్చటగా ఉంటాయి. ఇక అప్పుడే పుట్టిన పుంగనూరు దూడ అందాన్ని ప్రత్యేకంగా చెప్పనవసరమే లేదు. గొల్లప్రోలు మండలం చేబ్రోలుకు చెందిన రైతు ఓరుగంటి చక్రధరుడుకు పుంగనూరు ఆవు ఉంది. ఇది మంగళవారం చక్కటి పెయ్యదూడకు జన్మనిచ్చింది. కేవలం అడుగు ఎత్తు మాత్రమే ఉన్న ఆ ఆవు దూడను గొల్లప్రోలు జెడ్పీటీసీ సభ్యుడు వులవకాయల నాగ లోవరాజు, పశు వైద్యాధికారి డాక్టర్ హిమజ, మాజీ ఎంపీపీ వులవకాయల సత్యనారాయణ తదితరులు తిలకించి ఆనందించారు. – పిఠాపురం

### కొండెవరంలో జగనన్న ఆరోగ్య సురక్ష


కొండెవరంలో రోగులకు మందులు పంపిణీ చేస్తున్న దృశ్యం

**కొత్తపల్లి:** కొండెవరంలోని గ్రామ సచివాలయం వద్ద మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ శిబిరాన్ని గ్రామ సర్పంచి వేమగిరి చెల్లాయమ్మ, ఎంపీటీసీ దుళ్ల సత్తిబాబు ప్రారంభించారు. కొమరగిరి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో 285 మందికి పరీక్షలు నిర్వహించి మందులను అందజేశారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన న్యూట్రిషన్ స్టాల్‌ను ఎంపీడీఓ పి.వెంకట నారాయణ, ఇన్‌చార్జి ఈఓపీఆర్డీ శ్రీనివాస్ పరిశీలించారు. గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు.

**నేడు కుతుకుడుమిల్లిలో..**

కుతుకుడుమిల్లి శివారు పెద్ద కలవలదొడ్డిలో బుధవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించనున్నట్టు కొత్తపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి మౌనిక తెలిపారు.

### నేడు అన్నదానం

**సామర్లకోట:** స్థానిక లారీ స్టాండ్ వద్ద గణపతి నవరాత్రి ఉత్సవాల ముగింపు సందర్భంగా భారీ అన్నదానం నిర్వహిస్తున్నట్టు లారీ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు పబ్బినీడి దుర్గాప్రసాద్ తెలిపారు. మంగళవారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ భక్తులు అన్నప్రసాదాన్ని స్వీకరించాలన్నారు.

### రేపు వికాసలో ఇంటర్వ్యూలు

**కాకినాడ సిటీ:** వికాస కార్యాలయంలో గురువారం రిలయన్స్ రిటైల్ (హైదరాబాద్) కంపెనీలో పికింగ్ అండ్ ప్యాకింగ్ ఉద్యోగానికి ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్టు వికాస ప్రాజెక్టు డైరెక్టర్ కె లచ్చారావు మంగళవారం తెలిపారు. ఈ ఉద్యోగానికి ఎస్ఎస్‌సి ఉత్తీర్ణులైన 18 నుంచి 30 సంవత్సరాల లోపు స్త్రీ, పురుష అభ్యర్థులు అర్హులన్నారు. వీరికి నెలకు రూ.15,770 జీతం, నైట్ షిఫ్ట్ అలవెన్సెస్, అటెండెన్స్ బోనస్, రవాణా సౌకర్యం కల్పిస్తారన్నారు. ఆసక్తి గల అభ్యర్థులందరూ కలెక్టరేట్‌లోని వికాస కార్యాలయం వద్ద ఉదయం 9 గంటలకు సర్టిఫికెట్ల జెరాక్సులతో హాజరు కావచ్చని పీడీ తెలిపారు.

### సీఎం సభ ఏర్పాట్లపై కమిషనర్ సమీక్ష

**కాకినాడ:** ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గురువారం సామర్లకోట రానున్న నేపథ్యంలో అక్కడి సభ ఏర్పాట్లు, ఇతర అంశాలపై నగరపాలక సంస్థ కమిషనర్ సీహెచ్ నాగనరసింహారావు కార్పొరేషన్ అధికారులతో మంగళవారం సమీక్షించారు. వివిధ విభాగాధిపతులతో సమావేశమైన ఆయన సభ ఏర్పాట్లలో భాగంగా కాకినాడ నుంచి గృహనిర్మాణ లబ్ధిదారులు, స్వయం సహాయక సంఘాల సభ్యులను సభకు తీసుకువెళ్లే అంశంపై ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా తీసుకోవలసిన చర్యలు, ఏర్పాట్లపై అధికారులకు సూచనలు ఇచ్చారు. సమావేశంలో నగరపాలక సంస్థ కార్యదర్శి ఎం.ఏసుబాబు, డిప్యూటీ కమిషనర్ కోన శ్రీనివాస్ వివిధ విభాగాధిపతులు పాల్గొన్నారు.

### వివాహిత అదృశ్యం

**గండేపల్లి:** వివాహిత అదృశ్యంపై కేసు నమోదు చేసినట్టు ఎస్సై వై.గణేష్‌కుమార్ తెలిపారు. ఆయన వివరాల మేరకు గండేపల్లికి చెందిన నొక్కు లలిత గ్రామంలో ఆశ వర్కర్‌గా పనిచేస్తోంది. భర్త సుధాకర్‌తో గొడపడి ఆదివారం ఇంటి నుంచి వెళ్లి పోయిందని అప్పటి నుంచి తిరిగి రాలేదు. పలుచోట్ల వెతికినప్పటికీ ప్రయోజనం లేకపోవడంతో లలిత తల్లి విజయదుర్గ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేయనున్నట్టు తెలిపారు.

### బాలికల వసతి గృహం పరిశీలన

**ప్రత్తిపాడు:** స్థానిక ప్రభుత్వ బీసీ బాలికల వసతి గృహాన్ని పెద్దాపురం బీసీ వసతిగృహాల సహాయ సంక్షేమాధికారి ఎస్.రాజేశ్వరి మంగళవారం ఆకస్మిక తనిఖీ చేశారు. వసతిగృహ రిజిస్టర్లు, రికార్డులను తనిఖీ చేశారు. పరిసరాలను క్షుణంగా పరిశీలించారు. వసతిగృహ నిర్వాహణపై ఆమె సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వసతిగృహ సంక్షేమాధికారి ఎం.శైలజారాణి, సిబ్బంది పాల్గొన్నారు.